క్లుప్తంగా

సబ్సిడీ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం పీలేరు రైతు భరోసా కేంద్రం వద్ద వేరుశనగ విత్తనాయల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అనువుగా ప్రభుత్వం రైతులకు కావాల్సిన విత్తనకాయలు అందిస్తోందని తెలిపారు. ఏడీఏ వై.వి. రమణరావు మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె రెండు మండలాలకు 4400 క్వింటాళ్ల నారాయణి రకం విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

గొర్రెల కాపరికి ఆర్థిక సాయం



అల్లాబక్షుకు నగదు అందజేస్తున్న దృశ్యం

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంలో అల్లాబక్షు అనే వ్యక్తికి చెందిన 15 గొర్రెలు పిడుగు శబ్దాలకు మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సదరు గొర్రెల కాపరికి పలువురు దాతలు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. పోతుల సాయినాథ్ సహాయ సహకారాలతో గోపాలక్రిష్ణ, కామాక్షి అంజి, షోరూం సూరి, ముత్యాల ఆంజినేయులు, రాంబాబు, ప్రభాకర్, గణేష్, నాగరాజులు బాధితుడికి రూ.10 వేల నగదును అందజేశారు.

నూతన విద్యావిధానంపై రేపు అవగాహన సదస్సు

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డిగ్రీ కోర్సుల్లో నూతన విద్యావిధానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి అన్ని డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశం కోరు విద్యార్థులు అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మెరుగువారిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం సీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను భక్తులు ఊరేగింపు ఆలయం వద్దకు తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా చేపట్టారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

వాల్మీకిపురం: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కంప్యూటర్ కోర్సు వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో 42 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, కంప్యూటర్ అధ్యాపకులు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

పిడుగుపడి పాడి ఆవు మృతి

మొలకలచెరువు: మండలంలో పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. పత్తి కోట పంచాయతీ ఎర్రంరెడ్డిగారి పల్లెకు చెందిన రైతు శంకర ఇంటి ఆవరణంలో చెట్టు కింద పాడి ఆవును కట్టేశాడు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంపడింది. ఆవు కట్టేసిన చెట్టుపై పిడుగు పడింది. రూ. 60వేలు విలువ చేసే ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థల పరిశీలన

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలో పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలో మిల్లెట్ (చిరుధాన్యాలు) ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు సర్వే నెంబరు 760/13, 14లో ఎకరా స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేసినట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ములకలచెరువు: మండలంలోని దేవలచెరువు పంచాయతీ పర్తికోట సమీపంలోని చెరువులో, పెద్దపాళ్యం గేటు వద్ద ఉరుములు, గాలి వాన కారణంగా మంగళవారం రాత్రి ఏడు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. బుధవారం మండల విద్యుత్ ఏఈ రామలక్ష్మయ్య సిబ్బందితో వెళ్లి జేసీబీతో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్ లాగించే చర్యలు చేపట్టారు.

రత్నమ్మ సేవలు మరవలేనివి

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రత్నమ్మ సేవలు మరవరానివని సీడీపీఓ నాగవేణి తెలిపారు. బుధవారం ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించి వీడ్కోలు సభ నిర్వహించారు.

హజ్‌యాత్రికులకు ప్రభుత్వ సహకారం

- అదనపు భారాన్ని భరించిన రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీలో ముస్లింలకు సముచిత స్థానం
- హజ్‌యాత్రికుల వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే



హజ్‌యాత్రికుల వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వ నిబంధనల వల్ల ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌యాత్రకు వెళ్లేవారిపై పడే అధిక భారాన్ని రాష్ట్రప్రభుత్వం భరించి యాత్రికులకు పూర్తి సహకారం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లె ఈద్గామైదానంలోని మదరసాలో ఏపీ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్‌యాత్రకు వెళ్లేవారికి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్ ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్‌యాత్రకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మదనపల్లె నుంచి 120 మంది హజ్‌యాత్రకు వెళుతుండటంపై వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. గతంలో రాష్ట్రం నుంచి హజ్‌యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి వెళ్లేవారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌యాత్రకు రూ.3,88,350 ఉండటంతో తగ్గించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. వారి నిర్ణయం ఆలస్యం కావడంతో రాష్ట్రప్రభుత్వం సుమారుగా రూ.80 వేల వరకు అదనపు భారం మొత్తాన్ని హజ్‌యాత్రికుల వ్యక్తిగత ఖాతాలకు జమచేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. హజ్‌యాత్రకు ముస్లిం మేతరులను అనుమతించే విషయంలో అక్కడి ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాచారం ఉన్న నేపథ్యంలో అల్లా అనుగ్రహిస్తే హజ్‌యాత్ర చేసి మక్కాను దర్శించుకోవాలన్న కోరిక తనకు బలంగా ఉందన్నారు. హజ్‌యాత్రికులు తమ ప్రార్థనల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురించి దువా చేయాలన్నారు. వైఎస్సార్ సీపీలో ముస్లింలకు సముచిత స్థానంతో పాటుగా వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం సోదరులు జగన్నను ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. మైనారిటీ ఎమ్మెల్యేగా తాను ఎన్నికవడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తోడ్పాటు మరువలేనిదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. హజ్‌యాత్రీకులపై అదనపు భారం పడితే హజ్‌కమిటీ సభ్యుడిగా సమస్యను తాను ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే ఆయన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.15కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి ప్రతిఒక్కరి ఖాతాలో రూ.80,000 జమచేసేందుకు ముందుకువచ్చారన్నారు. ముస్లిం సోదరులందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ముఫ్తీ మాసూమ్‌సాఖిబ్ సాహెబ్, షాజహాన్‌సాహెబ్, జామియామసీదు ఖతీబ్ ఒ ఇమామ్ మౌలానా జలాల్‌సాహెబ్ తదితరులు హజ్‌యాత్రలో యాత్రికులు పాటించాల్సిన నిబంధనలు, యాత్ర ఫలప్రదంగా ముగిసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు. అనంతరం హజ్‌యాత్రికులకు వ్యాక్సినేషన్ వేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, హజ్‌కమిటీ మెంబర్ ఖాదర్‌బాషా, రఫీక్‌బేగ్, డాక్టర్. అజ్మతుల్లాఖాన్, ఆరీఫ్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌లు అమ్ము, ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, వసీం, ముబీనా, నాయకులు బాబ్‌జాన్, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, షరీఫ్, అస్లాంమురాది, సలీం, బావాజాన్, మౌలానాబషీర్ అహ్మద్, హాజీ మహమ్మద్‌ఖాన్ సాహెబ్, ఇస్మాయిల్, రియాజ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీ సర్వే

– జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహమ్మద్ ఖాన్



భూ రీ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ ఫర్హాన్ అహమ్మద్ ఖాన్

కలికిరి: ప్రభుత్వ లక్ష్యం దిశగా పక్కాగా భూ రీసర్వే చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామ పరిధిలోని కొర్నమిట్టపల్లి, మేడికుర్తి గ్రామ పరిధిలోని మజ్జిగవాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏఆర్ఐ ప్రకారం రైతులకు నోటీసులు ఇవ్వడం జరుగుతోందా.. నోటీసులు అందుకున్న రైతుల స్పందన ఎలావుంది.., రైతుల అనుభవం, రికార్డుల ప్రకారమే సర్వే జరుగుతోందా తదితరాలపై సర్వే సిబ్బందిని విచారించారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు పక్కాగా సర్వే చేసి రైతులకు మేలు చేకూర్చాలని ఆదేశించారు. కోర్టు కేసులు, తగాదాలు ఉన్నచోటు ఎదురయ్యే సమస్యలపై సిబ్బంది జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మేడికుర్తి గ్రామ సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. నవరత్నాలు పథకాలు, సచివాలయాల్లో అందుతున్న సేవలపై ఏర్పాటు చేసిన బోర్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళ పోలీసు విధులు, బాధ్యతలను విచారించారు. ఎస్‌డీజీ సర్వే, గర్భవతులు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఏఎన్‌ఎంను విచారించారు. కార్యక్రమాలలో తహశీల్దారు భాగ్యలత, డివిజినల్ సర్వేయర్ క్రిష్ణమూర్తి, ఎంపీడీఓ గంగయ్య, మండల సర్వేయరు దేవి, కార్యదర్శులు రెడ్డిప్రసాద్, రమేష్ బాబు, విఆర్ఓలు శంకరయ్య, చంద్రయ్య, విలేజ్ సర్వేయర్లు లహరి, ఫిర్దోష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి



శిక్షణ పొందిన కరాటే క్రీడాకారులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని డీఎస్‌డీఓ షేక్ షఫీ తెలిపారు. బుధవారం స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ పాఠశాలలో వేసవి కరాటే శిబిరంలో పాల్గొన్న కరాటే శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగిన శిక్షణ పొందిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం మార్కులు కలపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అందుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కరాటే ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం సాధ్యమని ఇందుకు కఠోరమైన సాధన ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించడానికి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ఎ.ఆర్.సురేష్, డాక్టర్ పాల్ రవికుమార్, టుటౌన్ హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి,మణిసాయి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రాయితీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తూ.. రైతుల పక్షపాతిగా సీఎం జగన్మోహన్ రెడ్డి ఉన్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు వేరుశెనగ విత్తనాలు కొరత లేకుండా రైతుల అవసరం మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సాగుకు అనువుగా ఉండే వేరుశనగ విత్తన కాయల పంపిణీలో కె6, నారాయణి రకం రకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు వేరుశెనగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏఓ హేమలత మాట్లాడుతూ మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాల్లో కె6 రకం 557 క్వింటాళ్లు, నారాయణి రకం 1082 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, ఆర్‌బికె చైర్మన్ నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, శ్రీధర్‌రాయల్, రఘు, వెంకట్రమణ, నరసింహులు, కిరణ్‌కుమార్, శివారెడ్డి, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగన్ సారథ్యంలో జనరంజక పాలన

పీలేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల్లో విజయవంతంగా ప్రభుత్వ పథకాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ఆనంద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున, శ్రీనాథరెడ్డి, హబీబ్, ఇబ్రహీమ్, ఉదయ్, గడిబాషా, రెడ్డిబాషా, మునీర్ పాల్గొన్నారు.

ఉర్దూ విభాగాన్ని ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీ,ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

మదనపల్లె సిటీ: మదనపల్లెలోని బీటీ కాలేజీలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలకు వినతిపత్రాలు అందజేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బీటీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఎంపి, ఎమ్మెల్యేలను కలిశారు. డివిజన్‌లో ఉర్దూ మీడియం పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉన్నాయని ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీంతో ఉర్దూ చదువుకునే విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఎంతో వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మహమ్మద్‌ఖాన్, ఉర్దూ అకాడమీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ ముబీనాసలీమ్, ఉర్దూ అకాడమీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వినియోగంలోకి తేవాలి



సంగసముద్రం డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

గుర్రంకొండ: డంపింగ్ యార్డును వినియోగంలోకి తేవాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని సంగసముద్రంలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా డంపింగ్‌యార్డు, గ్రామసచివాలయం, అంగన్‌వాడీకేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులో మొక్కలు నాటి శుభ్రం ఉంచుకోవాలన్నారు. యార్డుకు వెంటనే కరెంటు సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేవాలన్నారు. చెత్తనుంచి సంపద తయారి చేసే పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయం చేరుకొని సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజష్టర్లను తనిఖీ చేశారు. కొంతమంది సచివాలయంలో లేకపోవడంపై ఆరాతీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీకేంద్రం పరిసరాల్లో చెత్తకుప్పలు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణెమ్మ, పంచాయతీ కార్యదర్శులు చంద్రకళ, మణికుమార్, విశ్వనాథ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పదవీ విరమణ అధ్యాపకులకు సన్మానం

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన బొటనీ అధ్యాపకులు కె. సూర్యనారాయణ, జువాలజీ అధ్యాపకులు వై. ప్రభావతిలను ఘనంగా సన్మానించారు. బుధవారం గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గ్యారంపల్లె కళాశాలలో అధ్యాపకులుగా సేవలందించి ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భూపతి, రమాదేవి, శివమూర్తి, మస్తాన్‌వలి, వెంకటరమణ, హరి, రమేష్, కొండయ్య, సౌజన్య, మౌనిక, మధు, ప్రసన్నలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నాణ్యత పరిశీలన

నిమ్మనపల్లె: మండల పరిధిలో సిమెంట్ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ బృందం అధికారులు పరిశీలించినట్లు పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఏఈ వరప్రసాద్ తెలిపారు. బుధవారం మదనపల్లె పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలోని క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని రాచవేటివారిపల్లె, దిగువపల్లె, వెంగంవారిపల్లె గ్రామాల్లో ఇటీవల నిర్మాణం పూర్తయిన సిమెంటు రోడ్ల నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు రూ.11 లక్షలతో రాచవేటివారిపల్లెలో 110 మీటర్లు, దిగువపల్లెలో –92 మీటర్లు, వెంగంవారిపల్లెలో –94 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎం.బుక్కుల్లో నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తయిన సీసీ రోడ్డు కొలతలను పరిశీలించారు. నాణ్యత పరిశీలనలో భాగంగా ప్రతిచోటా శాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ పంట సాగుపై అవగాహన



వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీకాంత్

గుర్రంకొండ: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ పంట సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలకేంద్రమైన గుర్రంకొండ ఆర్బీకేలో వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటసాగులో ఎకరానికి 60 కేజీల విత్తన గింజలు వేసుకోవాలన్నారు. విత్తనశుద్ధి అనే ఎమ్–45 అనే మందు మూడు గ్రాములు, లేద టి విరిడి 8–10 గ్రాములు విత్తనాల్లో చల్లి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. దినివలన మొక్కలు సాంద్రత పెరగడమే కాకుండా వేరుకుళ్లు వంటి రోగాలు సోకవన్నారు. జిప్సం ఎకరానికి 20 కేజిల చొప్పున విత్తనాలు నాటిన 30 నుంచి 40 రోజుల్లోగా పంటపై పిచికారి చేయాలన్నారు. దీని వలన గింజల్లో నూనె శాతం పెరగడమే కాకుండా గింజ గట్టి పడుతుందన్నారు. వేరుశనగ పంట చుట్టూ మూడుసాళ్ల కొన్న లేదా సజ్జలు లేదా మొక్కకొన్నలు కంచెగా వేసుకోవాలన్నారు. డ్రోన్ అనేది రైతులు గ్రూపుగా ఏర్పడి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ విలువ రూ.10 లక్షలు కాగా రూ.5లక్షలు బ్యాంకు రుణం, మరో రూ.5లక్షలు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, వీహెచ్ఏలు నవాజ్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం ప్రారంభం

మదనపల్లె సిటీ: కురబ సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని బుధవారం స్థానిక సీటీఎం రోడ్డులోని గ్రంథాలయం వద్ద ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కురబలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండు రామాంజులు మాట్లాడుతూ పారిశ్రామికవేత్త వల్లిగట్ల రెడ్డప్ప రథం ఏర్పాటుకు సహకారం అందించారన్నారు. రథం అందుబాటులో ఉంటుందన్నారు.

ఎన్‌సీడీ సర్వే లక్ష్యాన్ని చేరుకోవాలి

కురబలకోట: ఎన్‌సీడీ–సీడీ సర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా ఎన్‌సీడీసీడి పీఓ డాక్టర్ శేషగిరిబాబు సూచించారు. కురబలకోట పీహెచ్‌సీ నందు బుధవారం ఆయన డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 84 శాతం మాత్రమే అబా హెల్త్ ఐడీలు చేశారని మిగిలిన వాటిని పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా కార్డు) అవసరమన్నారు. ప్రజలు సమీప సచివాలయ హెల్త్ సెక్రటరీని కలసి వారి ఆధార్ నెంబరుతో లింక్ చేసుకోవాలన్నారు.14 అంకెల హెల్త్ ఐడీ నెంబరు ప్రతి ఒక్కరికీ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారి ఆరోగ్య స్థితిగతులన్నీ ఈ అబా కార్డులో నమోదు చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుతో ఈ ఐడీ నెంబరు లింక్ చేయడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఒకే ఐడీ నెంబరుతో రోగి ఆరోగ్య పరిస్థితి ఆన్‌లైన్ చేయబడుతుందన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి క్రిస్టల్ దాస్, సీహెచ్ఓ జయచంద్రకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పూర్తి సమాచారం ఇవ్వండి

కలకడ : 'జగనన్నకు చెబుదాం' సమస్యలపై పూర్తి సమాచారం గ్రామాలలోని అన్ని సచివాలయ సిబ్బంది వెంటనే అందించాలని తహసీల్దార్ రాము, ఎంపీడీఓ గంగయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలతో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఏలాంటి ఫిర్యాదులు అందినా పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు నివేదించడానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరురూరల్ : జిల్లా వ్యాప్తంగా యాత్రికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం రాము అన్నారు. బుధవారం స్థానిక డీఎం కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రకాల టూరిజం బస్సులను యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విహార యాత్ర, విజ్ఞాన యాత్ర, దైవ దర్శనాల యాత్రలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు.

పొగతాగడం వల్ల ఆరోగ్యానికి హానికరం



పీలేరులో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

మదనపల్లె సిటీ: పొగతాగడం వల్ల ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్యశాఖ ఎన్‌సిడి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శేషగిరిబాబు అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జిల్లా ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ పద్మాంజలి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాద్‌రాజు, పాల్ రవికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: ప్రస్తుతం సమాజంలో పొగాకు వాడకం అధికంగా ఉందని, దీని వలన కేన్సర్, టీబీ లాంటి జబ్బులకు గురికావాల్సి వస్తుందని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి మానస అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, పొగాకు సేవించడం వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పొగాకును వాడనీయం.. వ్యాధులను దరి చేరనీయం అంటూ వైద్య సిబ్బందిచే ఆమె ప్రతిజ్ఞ చేయించారు.

పీలేరు : పొగాకు వలన ప్రాణాంతక వ్యాధులు వస్తాయని స్థానిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లె /కలికిరి/ కలకడ : ప్రతి ఒక్కరూ పొగాకు, గుట్కా, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీహెచ్‌వో సుమతి, పీహెచ్ఎన్ సుమలతలు కోరారు. బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోసువారిపల్లెలో అవగాహన ర్యాలీ చేశారు. కలకడ మండలం, కలికిరి మండలంలోని గర్నిమిట్ట, గ్యారంపల్లె, జిల్లేళ్లమందలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

3న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని జూన్ 3న అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. అరుణాచలంకు వెళ్లే భక్తులు ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034ను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా గంగ జాతర

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురంలో బుధవారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన గ్రామదేవతలకు మహిళలకు ఉపవాస దీక్షలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించారు.

నీతివంతమైన పాలన బీజేపీకే సాధ్యం

మదనపల్లె : దేశంలో నీతివంతమైన పాలన అందించిన ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని బీజేపీ సీనియర్ నాయకులు, కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షులు డాక్టర్. ఏ.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో ప్రధానిగా మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిందేనన్నారు. 65 ఏళ్లలో జరగని అభివృద్ధిని ప్రధాని మోదీ 9 ఏళ్లలో సాధించారన్నారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని దేశవ్యాప్తంగా పోలింగ్ బూత్‌స్థాయికి తీసుకెళ్లేందుకు మే 29 నుంచి జూన్ 30 వరకు రకరకాల కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో భగవాన్, నాగరెడ్డెమ్మ, పులినరేంద్రకుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కిరణ్, మల్లయ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.